## ఇండియన్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జాతీయ కో అర్డినేటర్‌గా నరాల నిహార్




4లో..

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజా జ్యోతి

ప్రతి అక్షరం- ప్రజల కోసం

నిజామాబాద్

శుక్రవారం.20, సెప్టెంబర్ 2024 4 పేజీలు

# ఇంటింటి సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

ప్రజా జ్యోతి నిజామాబాద్ బ్యూరో నిజామాబాద్ : ఎస్ఎస్ఆర్-2025 లో భాగంగా ఓటరు జాబితా సవరణ కోసం కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం నుండి పరిశీలకులుగా విచ్చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి గురువారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, నియోజకవర్గ కేంద్రాల తహశీల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

**పరిశీలకులు అబ్దుల్ హమీద్ సూచన కలెక్టర్ తో కలిసి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష**



3లో..

## కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంల తరలింపు

### పర్యవేక్షించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

ప్రజా జ్యోతి నిజామాబాద్ బ్యూరో : జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లో గల ఈవీఎం గోడౌన్ నుండి కట్టుదిట్టమైన భద్రత నడుమ సాంకేతిక లోపాలు తలెత్తిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను గురువారం బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీ.ఈ.ఎల్)కు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు జరిగింది.



3లో..

# ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం

**బోధన్ ప్రతినిధి సెప్టెంబర్ 19(ప్రజాజ్యోతి):**

రెంజల్ మండల కేంద్రంలోని నీలా గ్రామం నందు ప్రాథమిక పాఠశాలలో గురువారం రోజున స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయితీ కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ సింగిల్ ప్లాస్టిక్ పేపర్ వాడటం నిషేదమని, అలాగే ప్లాస్టిక్ ను వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మరియు గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని అలాగే ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని పరిశుభ్రతను పాటించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రామ్, మరియు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# పభుత్వ పాఠశాలలను పటిష్టం చేస్తాం

**– మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి.**

**ప్రజా జ్యోతి, నవీపేట్ :** సీఎం రేవంత్ రెడ్డి సర్కారు ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేస్తుందని, దానిలో భాగంగానే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు పూర్తి చేసి డీఎస్సీ 2024 నిర్వహించామని, మరికొన్ని రోజుల్లో నూతన ఉపాధ్యాయులు రానున్నారని మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. మండలం లోని బినోల ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రేపటి భవిష్యత్తు ను తీర్చిదిద్దే ఉపాధ్యాయులతో తల్లితండ్రులు మర్యాదగా వ్యవహరించాలని, పిల్లలను బోధించే క్రమంలో దండించిన ఉపాధ్యాయుల పట్ల దురుసుగా ప్రవర్తించొద్దని మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తల్లితండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన తాగునీరు, మూత్రశాలల నిర్మాణం, నూతన గదుల నిర్మాణం తదితర మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేస్తామని తెలిపారు. విద్యార్థినికి 5 వేల ప్రోత్సాహక బహుమతి. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శివ తాండవ నృత్యం చేసిన నాలేశ్వర్ ఉన్నత పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థిని సంజన కు ఎమ్మెల్యే 5 వేలు అందజేశారు. త్రిశూలం పట్టి శివ తాండవం చేసినట్లు సమాజంలో గల చెడు ను చీల్చి చెండాలని కోరుతూ 5 వేలు ఇచ్చినట్లు ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్ బిన్ హుందాన్, డీఈవో దుర్గా ప్రసాద్, ఎంపీడీఓ నాగనాథ్, ఎంఇఓ గణేష్ రావు, స్కూల్ హెడ్ మాస్టర్ మోహన్ రెడ్డి, పిఆర్టియు మండల అధ్యక్షులు భూమన్న, ప్రధాన కార్యదర్శి శివ కుమార్, వివిధ పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, పీఈటి లు, పి.డి. లు, అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





# ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

**పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్**



**ప్రజాజ్యోతి నిజామాబాద్ క్రైం :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో వినాయక నవరాత్రోత్సవాలతో పాటు నిమజ్జన శోభాయాత్ర వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి సీపీ కల్మేశ్వర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గణేశ్ ఉత్సవాలతో పాటు మిలాద్ – ఉన్ – నబి శాంతియుత వాతావరణంలో జరుపుకున్నారన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించిన ఉత్సవ సమితి సభ్యులు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# జెండా బాలాజీ హుండీ లెక్కింపు

**రూ 5.34 లక్షల ఆదాయం...**



**ప్రజా జ్యోతి నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన జెండా బాలాజీ ఉత్సవాలు ముగిశాయి. దీంతో గురువారం ఆలయ ఈవో వేణు, కమిటీ ఛైర్మన్ జలిగం గోపాల్, ఇన్ స్పెక్టర్ కమల, కమిటీ సభ్యుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. కాగా.. రూ. 5,34,840 ఆదాయం సమకూరినట్లు ఈవో వేణు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాము, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# నాయిని చెరువు లో చెత్త ను తొలగించిన మున్సిపల్ కమిషనర్

**జమ్మికుంట, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి ) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువు పరిసర ప్రాంతాలలో ఇటీవల జరిగిన గణపతి నిమజ్జనం చేయగా ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ప్లాస్టిక్ కవర్లు,పువ్వుల దండలు, కొబ్బరి చిప్పలు ఇతర చెత్తను జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ తన సిబ్బందితో కలిసి తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యండి ఆయాజ్ మాట్లాడుతూ నాయిని చెరువు పరిసర ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలలో మాల మూత్ర విసర్జన చేసినట్లయితే జరిమానా తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మహేష్ పాషా భాస్కర్ సానిటరీ ఇన్స్పెక్టర్ సదానందం పాల్గొన్నారు.

# ఓర్వలేకనే రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు

**ప్రజాజ్యోతి నిజామాబాద్ బ్యూరో:** దేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బీజేపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. రాహుల్ గాంధీ హత్య కు సైతం కుట్ర పన్నారని ఆరోపించారు. పార్టీ అగ్రనేత గురించి తప్పుగా మాట్లాడుతున్న నాయకులపై ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

# షబ్బీర్ పై ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

- నగరాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేస్తున్నారు
- బీజేపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు అసత్య ఆరోపణలు మానుకోవాలి
- కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశవేణు

**ప్రజాజ్యోతి నిజామబాద్ బ్యూరో:** ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నిజామాబాద్ నగరాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, ఆయనపై అసత్య ఆరోపణలు చేసే వారికి ప్రజలే బుద్ధి చెబుతారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. షబ్బీర్ అలీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎప్పటికప్పుడు చర్చిస్తూ నిజామాబాద్ నగర, జిల్లా అభివృద్ధి కోసం పాటుపడుతున్నారన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలను అప్ గ్రేడ్ ఇంజినీరింగ్ కళాశాలగా తీర్చిదిద్దుతున్నారని, రాష్ట్రంలో మొత్తం 10 పాలిటెక్నిక్ కళాశాలలు ఇంజినీరింగ్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం జరుగుతుందన్నారు. అందులో నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాల ఒకటని ఆయన తెలిపారు. ఎంతో మంది పేద విద్యార్థులు తాము కలలుగానే ఇంజినీరింగ్ విద్యను సాకారం చేసుకోవచ్చన్నారు. పాత కలెక్టరేట్ స్థలాన్నిప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పే కుట్రపన్నారని, కానీ తమ ప్రభుత్వం వచ్చాక కలెక్టరేట్ ప్రాంగణంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఇండోర్ స్టేడియానికి కూడా షబ్బీర్ అలీ ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందన్నారు. అలాగే బొందెం చెరువు బాధితులకు పునరావాసం, వారికి ఆర్థిక సాయం కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. భారీ వర్షం కారణంగా నాళాలో కొట్టుకుపోయి చనిపోయిన బాలికకు ఆర్థిక సహాయం కింద ప్రభుత్వ సలహాదారు ప్రభుత్వ పెద్దలతో చర్చించి బాలిక కుటుంబానికి నాలుగు లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వపరంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఇవేమీ తెలియని బీజేపీ ఎమ్మెల్యే, అతడి అనుచరులు షబ్బీర్ అలీపై అవాకులు చవాకులు పేలుస్తూ, లేని పోని అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని వీటన్నింటినీ వెంటనే మానుకోవాలని, లేకపోతే ప్రజలే వారికి తగిన గుణపాఠం చెప్తారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పీసీసీ కార్యదర్శి నరాల రత్నాకర్, యూత్ కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీ రామర్తి గోపి, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ప్రీతం, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, ఓబీసీ ప్రెసిడెంట్ నరేందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ మహేశ్, కేశ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కేశ వేణు

# కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంల తరలింపు

**పర్యవేక్షించిన కలెక్టర్, అదనపు కలెక్టర్**





**ప్రజా జ్యోతి నిజామాబాద్ బ్యూరో :** జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లో గల ఈవీఎం గోడౌన్ నుండి కట్టుదిట్టమైన భద్రత నడుమ సాంకేతిక లోపాలు తలెత్తిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను గురువారం బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీ.ఈ.ఎల్)కు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు జరిగింది. పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో 78 బ్యాలెట్ యూనిట్లు, రెండు కంట్రోల్ యూనిట్లను బీ.ఈ.ఎల్ కు తరలించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ఈ.సీ సూచనలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఈవీఎంలను తరలించారు. ఈ ప్రక్రియలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

**పరిశీలకులు అబ్దుల్ హమీద్ సూచన**

**కలెక్టర్ తో కలిసి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష**

**ప్రజా జ్యోతి నిజామాబాద్ బ్యూరో నిజామాబాద్ :**

ఎస్ఎస్ఆర్-2025 లో భాగంగా ఓటరు జాబితా సవరణ కోసం కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం నుండి పరిశీలకులుగా విచ్చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి గురువారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, నియోజకవర్గ కేంద్రాల తహశీల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ, ఇంటింటి సర్వే, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ ఏర్పాట్లు, స్వీప్ కార్యకలాపాలు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, దాఖలైన దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలలో నియోజకవర్గాల వారీగా ప్రగతిని సమీక్షిస్తూ, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 26 నాటితో గడువు ముగియనున్న దృష్ట్యా ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని, 100 శాతం సర్వే పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని అన్నారు. ఇప్పటికే సర్వే పూర్తి చేసిన బీఎల్ఓలను అవసరం ఉన్న చోట ఇతర పోలింగ్ కేంద్రాలలో సర్వే కోసం సర్దుబాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి తిరుగుతూ జాబితాను సరిచేయాలని, మరణించిన వారి పేర్లు తొలగించాలని, పేర్లు, చిరునామాలు వంటివి ఏవైనా మార్పులు ఉంటే, పక్కాగా నిర్ధారణ చేసుకుని బీఎల్ఓ యాప్ ద్వారా మార్చాలని సూచించారు. ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపి, ఐ.టీ టూల్స్ ద్వారా సరి చేయాలన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసే సమయానికే ఓటరు సవరణ జాబితా సమగ్రంగా రూపొందించబడితే, తదుపరి అభ్యంతరాలకు అంతగా ఆస్కారం ఉండదని అన్నారు. ప్రతి ఓటరుకు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు హక్కు ఉంది అనే వివరాలు తప్పనిసరిగా తెలిసేలా బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లచే అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ఓటర్లలో చైతన్యం పెంపొందించేందుకు స్వీప్ ఆక్టివిటీస్ ద్వారా విద్యా సంస్థలు, సామాజిక మాధ్యమాలు, బస్టాండులు తదితర రద్దీ ప్రదేశాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వేకు వెళ్లిన సమయంలో ఎస్ఎస్ఆర్-2025 అని మార్కింగ్ చేయించాలన్నారు. 15 వందలు ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అలాంటి చోట కొత్తగా మరొక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలైతే ఒకే ప్రదేశంలో రెండుకు మించి పోలింగ్ స్టేషన్లు ఉండకూడదని, పట్టణ ప్రాంతాల్లో 4 పీ.ఎస్ లకు మించి ఒకే లొకేషన్ లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పరిశీలకులు అబ్దుల్ హమీద్ సూచించారు. ఓటరు జాబితాలో ఫోటో, చిరునామా సరిగా ఉందా లేదా అన్నది ఒకటికి రెండు పర్యాయాలు క్రాస్ చెక్ చేసుకోవాలని, ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు అందరు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు హక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాలైన త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కాంపౌండ్ వాల్ తదితర వసతులు సరిగా ఉన్నాయా లేదా అన్నది ముందుగానే పరిశీలించుకోవాలని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్ధవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని సూచించారు. బూతు లెవెల్ ఆఫీసర్స్, సూపర్వైజర్స్, ఎన్నికల విభాగం కు సంబంధించిన రిజిస్టర్లు సక్రమంగా మెయింటైన్ చేస్తూ షెడ్యూల్ ప్రకారం ఎన్నికల కమిషన్ సూచించిన విధంగా కార్యకలాపాలు నిర్వహించాలని, అన్ని రాజకీయ పార్టీలు ప్రతినిధులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ ఎస్-ఎస్ఆర్-2025 కార్యక్రమాల గురించి వివరించాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఓటరు జాబితా సవరణ, స్వీప్ ఆక్టివిటీస్, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, తదితర వాటికి సంబంధించి చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలకులు అబ్దుల్ హమీద్ కు వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి ఓటరు జాబితా సవరణ తీరును పరిశీలకులు హమీద్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, బీఎల్ఓలు, సూపర్వైజర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతి, కిరణ్మయి, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, సహాయ ఈఆర్ఓలు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



## ఇండియన్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా

# జాతీయ కో ఆర్డినేటర్‌గా నరాల నిహార్

### రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో పాల్గొన్న నరాల నిహార్

### కాంగ్రెస్ ఢిల్లీ నాయకులతో సత్సంబంధాలు

ప్రజా జ్యోతి, నిజామాబాద్ బ్యూరో:

ఇండియన్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జాతీయ కో అర్డినేటర్ గా నరాల నిహార్ ను నియమిస్తు ఐవైసీ సోషల్ మీడియా నేషనల్ హేడ్ మనూ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఐదుగురు జాతీయ కోర్డినేటర్లను, నలుగురు కోఅర్డినేటర్లను నియమిస్తు అదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ నగరానికి చెందిన నరాల నిహార్ జాతీయ కో అర్డినేటర్ గా ఉండగా ఇటీవల యువజన కాంగ్రెస్ ఎన్నికల నేపథ్యంలో ఆ పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 14న యూత్ కాంగ్రెస్ ఎన్నికలు పూర్తి కావడంతో నరాల నిహార్ ను తిరిగి అదే పోస్టులో నియమాకం చేశారు. రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన జూడో యాత్రలో పాల్గొన్నారు. జూడో యాత్ర లో భాగంగా రాహుల్ గాంధీ టీంలో నిహార్ ఉన్నారు. జూడో యాత్ర విజయవంతంగా పూర్తయిన తర్వాత రాహుల్ గాంధీచే నిహార్ ప్రశంసలు అందుకున్నారు. నరాల నిహార్ జిల్లాకు చెందిన సీనీయర్ కాంగ్రెస్ నేత నరాల రత్నాకర్ తనయుడు.




## ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజా జ్యోతి జగిత్యాల్ : జగిత్యాల, సెప్టెంబర్ 19



జగిత్యాల ప్రభుత్వం మెడికల్ కళాశాలను కలెక్టర్ బి , సత్య ప్రసాద్.గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ డీటెయిల్స్ డిజిటల్ లాబ్ అనాటమీ మ్యూజియం రీసెర్చ్ రూమ్ లైబ్రరీ కళాశాలలోని తరగతి గదులు, కళాశాలలోని విద్యార్థులు ఎంతమంది ఉన్నారు అని కళాశాల ప్రిన్సిపల్ ఎస్ ఎస్ ఎస్ ఖాద్రి ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవనాన్ని కూడా విజిట్ చేశారు. మరియు కళాశాల హాస్టల్స్ కూడా సందర్శించారు.ఇందులో సంబంధిత సిబ్బంది వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అర్చన డాక్టర్ దేవిడ్ ఆనంద్, అనాటమీ డాక్టర్ కళా శిల్ప పాథాలజీ మరియు ఆర్ అండ్ బి శ్రీనివాస్. అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రైతులకు సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలి





**వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ దిశానిర్దేశం**
**నిర్లిప్తంగా వ్యవహరిస్తే వేటు తప్పదని హెచ్చరిక**
**రైతు ప్రయోజనాలే పరమావధిగా పనిచేసే వారిని ప్రోత్సహిస్తామని వెల్లడి**
**అన్నదాతకు నష్టం చేకూర్చే డీలర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశం**
**చీడపీడలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించిన శాస్త్రవేత్తలు**

ప్రజా జ్యోతి నిజామాబాద్ బ్యూరో :

నిజామాబాద్ : మరో నెల రోజుల్లోపు పంట దిగుబడులు చేతికి అందనున్న ప్రస్తుత తరుణంలో చీడపీడల బెడదతో రైతులు నష్టపోకుండా సస్యరక్షణ చర్యలపై వారికి అవగాహన కల్పించాలని శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వ్యవసాయ అధికారులకు సూచించారు. ఇటీవల కురిసిన ఏకధాటి వర్షాలతో వాతావరణ పరిస్థితులలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా పంటలకు దోమపోటు, ఆకుముడత వంటి తెగుళ్లు, చీడపీడలు సోకే ప్రమాదం ఉండడడంతో, వాటి నివారణ కోసం ముందస్తుగానే చర్యలు చేపట్టేందుకు వీలుగా గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను ఈ సమావేశానికి ఆహ్వానించగా, ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఆయా పంటలకు ఎలాంటి చీడపీడలు సోకే అవకాశం ఉంది, వాటి బారి నుండి పంట దిగుబడిని కాపాడుకునేందుకు పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాత్రవేత్తలు కీలకమైన సూచనలు చేశారు. రానున్న మూడు రోజులలో మరోమారు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన దరిమిలా పంటలకు నష్టం వాటిల్లకుండా చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, జిల్లాలో ఈసారి ఖరీఫ్ లో 4.29 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారని, అందులో 85 శాతానికి పైగా సన్నరకం ధాన్యం సాగు చేస్తున్నారని అన్నారు. భారీ వర్షాల వల్ల వరి పంటకు ఉధృత స్థాయిలో చీడపీడలు సోకే ప్రమాదం ఉన్నందున ముందస్తుగానే నివారణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏడీఏలు, ఏ.ఓలు, ఏ.ఈ.ఓలు, ఇతర వ్యవసాయ అధికారులు అందరు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులతో భేటీ అయ్యి వారికి సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని హితవు పలికారు. జిల్లాలో ఏ ఒక్క రైతు కూడా చీడపీడల వల్ల దిగుబడులు కోల్పోయి నష్టపోకుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లిప్తంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా చీడపీడల కారణంగా రైతులు నష్టపోతే, సంబంధిత వ్యవసాయ అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. అదే సమయంలో రైతుల ప్రయోజనాలు కాపాడడమే ధ్యేయంగా పని చేసే వ్యవసాయ అధికారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం కల్పిస్తామన్నారు. అదేవిధంగా రైతులకు నష్టం చేకూరేలా వ్యవహరించే ఎరువులు, విత్తన దుకాణాల డీలర్ల లైసెన్సులను రద్దు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయాలతో పాటు, అవసరం లేకపోయినప్పటికీ అధిక లాభార్జన కోసం ఎక్కువ పరిమాణంలో ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతులకు అంటగట్టే డీలర్లపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా ఎరువులు, క్రిమిసంహారక దుకాణాలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు సైతం దుకాణ డీలర్లను సంప్రదించకుండా, పంటలకు ఏవైనా చీడపీడలు సోకితే వ్యవసాయ అధికారులను, శాస్త్రవేత్తలను సంప్రదించాలని హితవు పలికారు. వారి సలహాలు, సూచనలను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి ఆర్థిక పురోగతిలో పయనించాలని అన్నారు. మోతాదుకు మించి ఎరువులు, పిచికారీ మందులు వాడి ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, భూసారాన్ని కోల్పోకూడదని జాగ్రత్తలు సూచించారు. ఈ దిశగా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ, అన్నదాతలు పూర్తి స్థాయిలో దిగుబడులు పొందేలా వారికి సలహాలు, సూచనలు అందించాలన్నారు. చీడపీడలు, తెగుళ్లు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించేలా పర్యవేక్షణ జరపాలన్నారు. పంటల మార్పిడి, స్వల్పకాలిక దిగుబడిని అందించే పంటలతో సమకూరే లాభాల గురించి అన్నదాతలకు అవగాహన కల్పించాలన్నారు. శాత్రవేత్తలు తెలియజేసిన సస్యరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు చేరేవిధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, శాస్త్రవేత్తలు డాక్టర్ బాలాజీ నాయక్, రాజ్ కుమార్, దివ్య, ఏ.డీ.ఏ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు పై జరిగిన దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన జర్నలిస్టు సంఘాల నేతలు**

ఎండపల్లి, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాం పల్లి లో బుధవారం రాత్రి డెమోక్రటిక్ జర్నలిస్ట ఫెడరేషన్ సబ్యుడు,జర్నలిస్టు తుమ్మ శ్రీనివాస్ పై జరిగిన దాడిపై డిజెఎఫ్ తో పాటు ఇతర జర్నలిస్టు సంఘాల నేతలు డిజెఎఫ్ జాతీయ అద్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి సూచనతో వెల్లటూర్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా డెమోక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోటపలుకుల వెంకట్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా పై వార్తలు రాయడంతో పాటు రాజారాం పల్లి లో కొందరు వ్యక్తులు దౌర్జన్యాలకు,అమాయకులపై దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్న క్రమంలో బాధితుల పక్షాన జర్నలిస్టు తుమ్మ శ్రీనివాస్ నిలిచాడని తెలిపారు.దీంతో ఇసుక అక్రమదారులు,మరికొందరు వ్యక్తులు శ్రీనివాస్ పై దాడి చేయడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు.జర్నలిస్టుపై జరిగిన దాడిని పరిశీలిస్తే హత్య చేయాలనే ఉద్దేశం ఉందని అనుమానించారు.దాడికి పాల్పడిన వ్యక్తులపై గతంలో పలు పోలీస్ స్టేషనలలో కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు.రాజారాంపల్లిలో లో జర్నలిస్టుపై జరిగిన దాడిపై పోలీసులు తీవ్రంగా పరిగణించాలని,దీనిపై డిజెఎఫ్ ఆద్వర్యంలో కార్యచరణ ఉంటుందని తెలిపారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు.తుమ్మ శ్రీనివాస్ పై దాడి చేసిన వ్యక్తులు తప్పుడు కేసు పెట్టాలని కుట్ర చేస్తున్నారని తెలిసిందని అనవసరమైన కుట్రలు చేస్తే జర్నలిస్టులు సత్తా చూపుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిజెఎఫ్ జగిత్యాల జిల్లా అద్యక్షుడు తొట్ల గంగాధర్,డిజెఎఫ్ ఎండపల్లి మండల అద్యక్షుడు ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి శ్రీధర్,ఉపాధ్యక్షుడు మల్లేశం గౌడ్, ప్రచార కార్యదర్శి మనోజ్,సతీష్, రియాజ్,అశోక్,టిడబ్ల్యూజెఎఫ్ వెల్లటూర్ మండల అద్యక్షుడు కుశ్నపల్లి రాజేందర్,ప్రధాన కార్యదర్శి అతీక్,పెద్ద స్వామీ,ఓదెలు,రాకేష్,దర్మారం ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

